క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



చల్లపల్లి: నూతన వధూవరులు ప్రత్యూష, సాయిశ్రీనివాస్‌లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం ఆశీస్సులు అందజేశారు. మంగళాపురం గ్రామానికి చెందిన చంద్ర వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న కుమారుడు సాయిశ్రీనివాస్‌కు, చల్లపల్లికి చెందిన ఆకుల శ్రీరామమూర్తి, వనజ దంపతుల కుమార్తె ప్రత్యూషకు 30వ తేదీ రాత్రి విజయవాడలో వివాహం జరిగింది. కాగా మండల పరిధిలోని మేకావారిపాలెం గురువారం ఏర్పాటు చేసిన రిసెప్షన్ వేడుకలో సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), అవనిగడ్డ కో–ఆప్షన్ సభ్యుడు నజీర్‌బాషా, మాజీ పీఏసీఎస్ ప్రెసిడెంట్ పేరం నాగిరెడ్డి, శివనాగమల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

చెరువుల్లో నీటిని నింపడానికి చర్యలు

గుడ్లవల్లేరు: వేసవి నేపథ్యంలో గుడ్లవల్లేరు మండలంలోని గ్రామ పంచాయతీ మంచినీటి చెరువుల్లో తాగునీటిని నింపుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ టి. విజయ సారథి ఆదేశించారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ చెరువుల్లో తాగునీటిని నింపుకొనేందుకు ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు మంచినీటి బోదెలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతపై పోలీసు సిబ్బంది అవగాహన కలిగించాలని కోరారు. అలాగే వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ జీ గోపాలరావు, ఏఈ నాగేశ్వరరావు, సర్పంచులు రేమల్లి తాతబ్బాయ్, కోటప్రోలు నాగు, వీర్నాల లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు ముక్కు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

‘పది’ టాపర్స్‌కు సత్కారం



చల్లపల్లి: విద్య అనే ఆయుధంతో ప్రపంచాన్నే జయించవచ్చని, అందుకే ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకోవాలని ఎన్టీఆర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు విశ్రాంత ఉపాధ్యాయులు అడపా గురవయ్య, కైతేపల్లి దాస్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో చల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బత్తుల బ్యూల పాలవెల్లి(575), గాలి శశికల(574)లను గురువారం పార్కు ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా పాలవెల్లికి రూ.5వేలు, శశికలకు రూ.3వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మత్తి రాంబాబు, యడ్ల రాము, అనుమకొండ పూర్ణచంద్రశేఖర్, అడపా గురవయ్య, దుట్టా శివప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు నేడు పుష్పార్చన

నాగాయలంక: ఆర్ద్ర నక్షత్ర పర్వదినం నేపథ్యంలో స్థానిక శ్రీరామ పాదక్షేత్రంలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శుక్రవారం ప్రదోష కాల సమయంలో స్వామివారికి దశ సహస్ర తెల్ల జిల్లేడు పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, అర్చకుడు సాయికిరణ్‌శర్మ గురువారం తెలిపారు. ఈ పూజ వల్ల అపమృత్యు, పితృదోషాలు అనారోగ్య బాధలు నివృత్తి కాగలవని పేర్కొన్నారు. భక్తులు స్వయంగా తెల్లజిల్లేడు పువ్వులతో వచ్చి పుష్పార్చనలో పాల్గొనవచ్చని అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: ఏఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు షూటింగ్ చాంపియన్‌షిప్ శిక్షణ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ గురువారం తెలిపారు. గత నెల 19 నుంచి 30వ తేదీ వరకు కాకినాడ జిల్లా పెద్దాపురం నవోదయ విద్యాలయంలో జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో ఈ శిక్షణ జరిగిందని వివరించారు. కళాశాలకు చెందిన చేబ్రోలు సన్ని, ఎం. వరుణ్‌కుమార్, పి. ఆదిత్య యువరాజ్, పి. వెంకటరమణ, టి. కృష్ణ ప్రసాద్, బి. మానస, కె. రాములమ్మ, షేక్ రహీమున్నీసా ఉత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎండీ సలీమ్ అభినందించారు.



బందరు ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సూపరింటెండెంట్ ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్‌లు



నాగాయలంకలో అరుణ పతాకం ఎగురవేసిన భవన నిర్మాణ కార్మిక నేత నాగేశ్వరరావు



పెడనలోని బ్రహ్మపురం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఎర్ర జెండాను ఆవిష్కరిస్తున్న హేమసుందరరావు

ఉద్యమ స్ఫూర్తి.. చైతన్య దీప్తి

» వాడవాడలా ఘనంగా మేడే వేడుకలు » రెపరెపలాడిన అరుణ పతాకాలు » ఉత్సాహంగా పాల్గొన్న కార్మిక లోకం

మచిలీపట్నంటౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో కార్మికలోకం గురువారం ఘనంగా నిర్వహించింది. ఉదయం నుంచే పలు రంగాలకు చెందిన కార్మికవర్గ సంఘాలకు చెందిన స్థూపాల వద్ద ఆయా సంఘాల నాయకులు అరుణ పతాకాలను ఎగురవేసి మిఠాయిలు పంచారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్, సీఐటీయూ, ఏఐటీయూసీ వంటి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల స్థూపాల వద్ద కూడా అరుణ పతాకాలను ఎగురవేశారు.

- బందరులోని జిల్లా సర్వజన ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఆస్పత్రి ఉద్యోగులు, ఆటో కార్మికుల, పారిశుద్ధ్య కార్మికుల స్థూపాల వద్ద అరుణ పతాకాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డి. ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు జి. భానుమూర్తి, బి. శ్రీనివాసరావు, ఆర్ఎంఓ నిరంజన్‌కుమార్ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు బెల్లంకొండ కోటేశ్వరరావు, లింగం ఫిలిప్, కరెడ్ల అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం వద్ద అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని సంఘ నాయకుడు ఎస్. ధనుంజయరావు జెండా ఊపి ప్రారంభించారు. ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి కిషోర్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.
- సీపీఎం కార్యాలయం వద్ద, పలు సెంటర్లలోని కార్మికుల స్థూపాల వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహారావు అరుణ జెండాలను ఎగురవేశారు. సీపీఎం నాయకులు కొడాలి శర్మ, బూర సుబ్రహ్మణ్యం, జయరావు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ఎల్ఐసీ ఉద్యోగుల బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఐసీఈయూ నాయకులు

- మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు లింగం ఫిలిప్, వై. ఈశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.
- స్థానిక బెల్ కంపెనీ వద్ద ది అస్కో నేషనల్ మజ్దూర్ యూనియన్, స్ఫూర్తి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు, పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు.
- స్థానిక ఐదు రోడ్ల సెంటర్‌లో మచిలీపట్నం టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నవ చైతన్య ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, మచిలీపట్నం టౌన్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు, ఎల్ఐసీ విశ్రాంత డెవలప్‌మెంట్ ఆఫీసర్ పేర్ని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కొడాలి సెంటర్లో సీఐటీయూ జెండా ఎగుర వేస్తున్న నేతలు

ఐక్యతతో హక్కుల సాధన

పెడన: పట్టణంలో బ్రహ్మపురం వివేకానంద పార్కు స్థూపం వద్ద సీపీఐ నాయకుడు కట్టా హేమ సుందరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ ఏర్పాటు చేయగా, ఆ ర్యాలీ బ్రహ్మపురం వివేకానంద పార్కు నుంచి బంటుమిల్లి రోడ్డులోని తులసి థియేటర్, బంగ్లా స్కూల్, బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. ఆయా ప్రాంతాల్లోని కార్మిక సంఘ స్థూపాల వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రజెండాలను ఆవిష్కరించారు. కార్మికులకు ఎర్ర కండువాలు పంపిణీ చేశారు. కట్టా హేమ సుందరరావు మేడే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పెడన సీపీఐ పార్టీ కార్యదర్శి తుమ్మా చిన కొండయ్య, మాజీ వైస్‌చైర్మన్ బళ్ల గురునాథరావు, గుత్తి పూర్ణచంద్ర రావు, బూసం బాలసుబ్రహ్మణ్యం, ఇనుమర్తి శ్రీను, రావూరి భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని శ్రీనివాస ట్రేడర్స్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కార్యాలయం వద్ద యాజమాని వీణం శ్రీనివాస్ కార్మికులకు ఎర్ర కండువాలను అందజేసి మిఠాయిలను పంచారు. పెడన పట్టణ సిమెంట్, రిక్షా హమాలి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పెడన గృహనిర్మాణ సంక్షేమ సంఘం, ముఠా కార్మిక సంఘాల నాయకులు బాలాజీ, వెంకట్, ప్రసాద్, రాజులపాటి వెంకన్న, వీణం వెంకన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సంఘటిత శక్తిగా ఎదగాలి..

నాగాయలంక: నాగాయలంక ప్రధాన సెంటర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం, వెల్డర్స్ సంక్షేమ సంఘం నేతృత్వంలో జరిగిన కార్యక్రమాల్లో అరుణ పతాకాలను భవన నిర్మాణ కార్మిక సంఘం నేత వాడపల్లి నాగేశ్వరరావు ఎగురవేశారు. సందేశం ఇస్తూ అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులంతా సంఘటితంగా తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తూనే సమాజ హిత సేవా కార్యక్రమాల్లో సైతం పాల్గొనాలన్నారు. సీఐటీయూ సీనియర్ నేత కన్నా రాజు, షేక్ జానీ, గుంటూరు మోహన్ పాల్గొన్నారు. కృష్ణానది తీరం, అంబేడ్కర్ నగర్‌లో రైతుకూలీ సంఘం జరిపిన వేడుకలో సంఘం జిల్లా కోశాధికారి తలశిల లీలామనోహర్ పతాకం ఆవిష్కరించారు.

మేడే అంటే కార్మిక విజయం..



కృత్తివెన్ను మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు

కృత్తివెన్ను: ఎందరో త్యాగమూర్తుల ఫలితంగా శ్రామిక వర్గాలు ఎనిమిది గంటల పనివేళలుగా రూపొందాయని ఇది నిజమైన కార్మిక విజయమని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. మేడేను పురస్కరించుకుని గురువారం కృత్తివెన్నులో కూనపరెడ్డి రాఘవయ్య జ్ఞాపకార్థం ఆయన స్థాపించిన స్థూపం వద్ద ఎర్ర జెండాను సీపీఎం నాయకులు గుగ్గిళ్ల శ్రీరామమూర్తి కుమారుడు జయరాజు ఆవిష్కరించారు. కృత్తివెన్ను మండలం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాస్, వెంకన్న, శరణం శ్రీను, నరసింహారావు, నాగరాజు, బాలకృష్ణ, తోట తాతాజీ పాల్గొన్నారు.

శ్రమజీవులు ఐక్యంగా పోరాడాలి

చల్లపల్లి: కార్మిక దినోత్సవ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ శ్రమజీవులు అందరూ ఐక్యంగా పోరాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ పిలుపునిచ్చారు. చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జెండా ఎగురవేశారు. ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ప్రజలు దానిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, హనుమానుల రాణికుమారి, ఉప్పాల సాంబశివ రావు, అట్లూరి వెంకటేశ్వరరావు, నక్కా శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ తదితరులు

కార్మికులే ఆధారం: ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి: పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు వృత్తి ఏదైనా కార్మికులపై ఆధారపడి ఉన్నాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక కనకదుర్గా ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణప్రసాద్ కార్మిక జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ముఠా కార్మికులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల అవసరాలు, వారి ప్రాముఖ్యతపై మాట్లాడారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ బొర్రా కాశీ, కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గూడవల్లి తాతయ్య, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వీరబాబు, ముఠా కార్మిక సంఘ నాయకుడు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

- సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కూడళ్ల వద్ద ఎర్ర జెండాలను నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం కార్యాలయం వద్ద ఐసీడీఎస్ కార్యాలయం, గాంధీ మండపం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద నాయకులు జెండాలను ఎగురవేసి మేడే గురించి ప్రసంగించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం, సీఐటీయూ నాయకులు ఎం. శ్రీనివాసరావు, జి. నాగేశ్వరరావు, పి. ధనశ్రీ, ఎల్. అజయ్‌గోష్ తదితరులు పాల్గొన్నారు.



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

వేడుకగా మేడే..

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, ఆటో, రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో విడివిడిగా జెండాను ఆవిష్కరించి, అమరవీరులకు జోహార్లు అర్పించారు. రాజశేఖర్, నాగేశ్వరావు, కోసూరు రామాంజనేయులు, కొలుసు లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవిలో జెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు

పోరాడితేనే సమస్యలకు పరిష్కారం..

కొడాలి(ఘంటసాల): ఐక్య పోరాటం ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ నేత వాకా రామచంద్రరావు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి సెంటర్లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేత పల్లికొండ శ్రీనివాసరావు సీఐటీయూ జెండా ఎగురవేశారు. సీఐటీయూ నేతలు మేడంకి వెంకటేశ్వరరావు, జంపాన బాలవీర రాఘవయ్య, యడ్లపల్లి గోవిందరాజులు, పడమట సాగర్ తదితరులు పాల్గొన్నారు.

- ఘంటసాల మండలం గోగినేనిపాలెంలోని సీపీఐ స్మారక స్థూపం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుంపటి వెంకటేశ్వరరావు ఎర్రజెండాను ఎగుర వేశారు. మాజీ సర్పంచ్ అత్తలూరి గోపాలకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు కొడాలి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోర్టు చట్టంతో కృష్ణాజిల్లా కనుమరుగు

చల్లపల్లి: నిరుపేదల నుంచి పెద్ద ఎత్తున భూములు లాక్కొని వాటిని పెద్దపెద్ద కంపెనీలు, బడాబాబులకు దోచిపెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం పీ4 సర్వేను నిర్వహించిందని సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు జె.జగన్ ఆరోపించారు. కార్మిక దినోత్సవం సందర్భంగా ఆయన చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు వద్ద, నారాయణరావునగర్‌కాలనీ, లక్ష్మీపురం పంచాయతీ శివారు శివరామదుర్గాపురం ప్రాంతాల్లో జెండా ఎగురవేసి, కార్మిక అమరవీరులకు నివాళులు అర్పించారు. మచిలీపట్నం పోర్టుకు అవసరమైతే 100 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడైనా భూములు తీసుకునేందుకు తీసుకువచ్చిన చట్టం ద్వారా భవిష్యత్‌లో కృష్ణాజిల్లా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. రైతుకూలీ సంఘం నాయకులు ఈపూరి రాంబాబు, కుంభా రామకృష్ణ, మునిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు వద్ద ఎర్రజెండా ఎగురవేస్తున్న జగన్, ఇతర నాయకులు

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ తరగతులను ప్రారంభించిన రిటైర్డ్ ఆర్డీవో శివరామకృష్ణ



కొడాలి గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

చల్లపల్లి: బాలబాలికలు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఆర్డీవో నాదేళ్ల శివ రామకృష్ణ కోరారు. మండల పరిధిలోని పురిటిగడ్డ షిర్డీసాయి ఆడిటోరియంలో ఇప్పటికే వెలువోలుకు చెందిన టీచర్ రామకృష్ణ పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్, లెక్కలు, ఇతర విజ్ఞాన అంశాలను బోధిస్తున్నారు. కాగా గురువారం నుంచి కొత్తగా చల్లపల్లికి చెందిన ప్రఖ్యాత కూచిపూడి నృత్య గురువు డి.మెహెర్ నరసింహారావు ఆధ్వర్యంలో నాట్య శిక్షణ తరగతులు ఏర్పాటుచేశారు. ఈ కూచిపూడి శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ చదువుకునే పిల్లలు కేవలం చదువుకు సంబంధించిన అంశాలపైనే కాకుండా సామాజిక, సాంస్కృతిక అంశాలపై కూడా మక్కువ కలిగి వుండాలన్నారు. పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకురాలు ఓలేటి ఉమాసరస్వతి, వెంకటేశ్వర రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలం కొడాలి, ఘంటసాల గ్రామాల్లోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలి గ్రంథాలయంలో అధికారి ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థుల చేత కథలు పుస్తకాలు చదివించి, చెప్పించారు. అనంతరం కార్యమ్స్, లూడో వంటి ఆటలు నిర్వహించారు. అలాగే ఘంటసాల గ్రంథాలయంలో అధికారి ఎం.శరత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞాన కథలు, ఆటలు పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు ఖోఖో పోటీలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఖోఖో ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే పలు కథలను చెప్పి, పుస్తకాలు చదివించారు. స్పోకెన్ ఇంగ్లిష్, లెక్కలు వంటి సబెక్టులలో ఉపాధ్యాయులు తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమాలను ఉపగ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్, లైబ్రేరియన్ జయలక్ష్మి పర్యవేక్షించారు.

కార్మికులకు నూతన వస్త్రాల బహూకరణ

చల్లపల్లి: కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ పార్కులో పనిచేసే సాలా నాగరాజు, కైలా శ్రీనివాస్‌లకు ఉపాధ్యాయులు రఫీ ఘోరి గురువారం నూతన వస్త్రాలు బహూకరించారు. తన తల్లిదండ్రులైన హంజా ఘోరి, హలీమున్నీసాల జ్ఞాపకార్థం ఈ వస్త్రాలను అందజేస్తున్నట్లు రఫీ తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు అడపా గురవయ్య, తాతారావు మాస్టారు, కోడూరు వెంకటేశ్వరరావు, అంబటి బసవశంకరరావు, రైటర్ రమేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు..

చల్లపల్లి: కార్మిక దినోత్సవం సందర్భంగా విజయా ఆయిల్ కంపెనీ నిర్వాహకులు దింటకుర్తి రంగనాయకులు గురువారం స్థానిక పంచాయతీలో పనిచేస్తున్న 55మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులు అందజేశారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న ఆయిల్ కంపెనీ నిర్వాహకులు

కొత్త స్తంభాలు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



చల్లపల్లి: మండల పరిధిలోని మాజేరు శివారు పచ్చావారిలంకలో విద్యుత్ వైర్లు కిందికి వాలిపోయి చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా ఉండటాన్ని గుర్తించి ‘ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు’ అనే శీర్షికన ఏప్రిల్ 28వ తేదీన సాక్షి దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. దీనికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఏఈ బసవ శాస్త్రులు, లైన్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి వెళ్లి ఆ ప్రాంతంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. కిందికి జారిన విద్యుత్ వైర్లను పైఎత్తులో ఏర్పాటు చేశారు. విద్యుత్ లైన్‌ను సరిచేసినందుకు స్థానికులు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

శ్రీకాకుళం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను దాసం రామకృష్ణతో కలసి ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ వేసవి సెలవుల్లో భాగంగా స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు, యువత చిన్నాను ఘనంగా సన్మానించారు.

20 వరకు టోర్నీ..

టోర్నీ ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇప్పటి వరకు వివిధ జిల్లాల నుంచి 32 క్రికెట్ జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందించనున్నట్లు కమిటీ సభ్యులు లీలా, సన్నీ, వెంకట సాయి తెలిపారు.



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎంపీటీసీ చిన్నా

కూటమి ప్రాపకం కోసమే హంగామా

నాగాయలంక: అమరావతికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాక కేవలం కూటమి ప్రభుత్వ ప్రాపకం కోసమేనని మండలంలోని గణపేశ్వరాలయాల ధర్మకర్త, ఏఎంసీ మాజీ చైర్మన్ మండల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలోనే తెలుగుదేశం అధికారంలో ఉండగానే అమరావతి రాజధానిగా ప్రధాని మోదీ శంకుస్థాపన చేయగా.. ముందడుగు వేసిన దాఖలాలే లేవని, ఇపుడు మళ్లీ పునఃప్రారంభ పనులకు శంకుస్థాపన హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ మద్దతు కోసం బీజేపీ అమరావతే రాజధాని అని ప్రకటించలేని మోదీ ప్రభుత్వం.. ఇపుడు పునఃప్రారంభ అమరావతికి శంకుస్థాపనలు కేవలం కూటమి ప్రభుత్వ మద్దతు కోసమేనన్నారు.

గోళ్ల నాగేశ్వరరావుకు నివాళి

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గోళ్ల నాగేశ్వరరావు చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు గురువారం నివాళులర్పించారు. ఇటీవలే ఆయన గుండెపోటుతో మరణించగా ఆయన స్వగృహం వద్ద గోళ్ల నాగేశ్వరరావు చిత్రపటానికి సింహాద్రి, కడవకొల్లుతో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సింహాద్రి మాట్లాడుతూ గోళ్ల నాగేశ్వరరావు, ఆయన భార్య ఎంపీటీసీ గోళ్ల కృష్ణకుమారి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



గోళ్ల నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి